14వ పాఠం

## ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించటం (షిర్క్)

అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకమైన విషయాలలో వేరితరులను సహవర్తులుగా, భాగస్వాములుగా చేర్చటాన్ని 'షిర్క్' అంటారు. షిర్క్ రెండు రకాలు:

1) పెద్ద తరహా షిర్క్ (షిర్కె అక్బర్)

2) చిన్న తరహా షిర్క్ (షిర్కె అస్గర్)

### 1. పెద్ద తరహా షిర్క్

ప్రవక్తలను, పుణ్యపురుషులను (వలీలను), సజీవులను, నిర్జీవులను, చలనము ఉన్న వస్తువులను, చలనములేని వస్తువులను, ఇతరత్రా వాటిని అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పించటాన్నే పెద్ద తరహా షిర్క్ అంటారు. ఇది ఘోరాతిఘోరమైన నేరం. మహాపరాధం. అన్యాయం. అతిపెద్ద దుర్మార్గం. దారుణం. అల్లాహ్ ఒకే ఒక్కడని, ఆయన సాటిలేని మేటి అని తెలిసిన తరువాత కూడా ఆయనకు సహవర్తుల్ని కల్పించేవారు ఆయన ఆగ్రహానికి గురవుతారనీ, అలాంటివారు ఎన్ని సత్కార్యాలు చేసినా అల్లాహ్ సన్నిధిలో అవన్నీ వృధా అయిపోతాయని, వారు శాశ్వతంగా నరకానికి ఆహుతి కావలసిందేనని దివ్య ఖుర్ఆన్‌లో స్పష్టంగా చెప్పబడింది. ఉదాహరణకు:

ఈ ఆయతులను గమనించండి–

**"ఒకవేళ వీరు (దీనికి ముందు ఆయతులో ప్రస్తావించబడిన 18 మంది ప్రవక్తలు) సయితం దైవత్వంలో భాగస్వామ్యానికి**

https://teluguislam.net

**(షిర్క్‌కి) ఒడిగట్టి ఉంటే, వారు చేసుకున్న కర్మలన్నీ వృథా అయిపోయేవి."** ***(ఖుర్‌ఆన్ 6 : 88)***

**"ముష్రిక్కులు (ఒకవైపు) తాము స్వయంగా తమ అవిశ్వాసాన్ని గురించి సాక్ష్యమిస్తున్నప్పుడు వారు అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు ఎంతమాత్రం తగరు. వారి కర్మలన్నీ వృథా అయిపోయాయి, శాశ్వతంగా వారు నరకాగ్నిలో ఉంటారు."** ***(ఖుర్‌ఆన్ 9 : 17)***

షిర్క్ చేస్తున్న స్థితిలో చనిపోయిన వారిని క్షమించటంగానీ, వారికి స్వర్గంలో ప్రవేశం కల్పించటంగానీ జరగదు. అల్లాహ్ ఆదేశం ఇలా వుంది:

**"తనకు భాగస్వామ్యం (షిర్క్) కల్పించటాన్ని అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. షిర్క్ మినహా తాను కోరిన వారి ఇతర పాపాలను క్షమిస్తాడు."** ***(ఖుర్‌ఆన్ 4 : 116)***

వేరొక సందర్భంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"ఎవరు అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను కల్పించారో అలాంటి వారికోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడని తెలుసు కోండి. అలాంటివారి నివాసం నరకాగ్ని. దుర్మార్గులకు సహాయ పడే వారెవ్వరూ ఉండరు."** ***(ఖుర్‌ఆన్ 5 : 72)***

చనిపోయిన వారిని, విగ్రహాలను సహాయం కొరకు అర్థించటం, వారి ముందు మొక్కుకోవటం, వారి పేరిట పశువులను బలి ఇవ్వటం– ఇలాంటివన్నీ ఈ రకమైన షిర్క్ క్రిందికి వస్తాయి.

## 2 చిన్న తరహా షిర్క్

ఈ రకమైన షిర్క్ (షిర్కె అస్‌గర్) కూడా ఉంటుందని ఖుర్‌ఆన్

https://teluguislam.net

హదీసుల ద్వారా రూఢీ అవుతున్నది. అయితే ఇది పెద్ద తరహా షిర్క్ వంటిది కాదు. కొన్ని పనుల్లో కాపట్యతను ప్రదర్శించటం, అల్లాహ్ తప్ప ఇతరులపై ప్రమాణం చేయటం, "అల్లాహ్ తలచినది, ఫలానా వారు తలచినది" అంటూ అల్లాహ్‌ను, ఇతరులను సమానులుగా చేస్తూ మాట్లాడటం మొదలగునవన్నీ చిన్న తరహా షిర్క్‌కు ఉదాహరణలు.

మహ్మూద్ బిన్ లబీద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం), "నేను మీ విషయంలో ఎక్కువగా భయపడేది చిన్న తరహా షిర్క్ గురించే" అని అన్నారు. అందుకు అక్కడున్నవారు, 'చిన్న తరహా షిర్క్ అంటే ఏమిటి?' అని అడిగారు. "ప్రదర్శనాతత్వం (అంటే చుట్టుప్రక్కలవారు తన పుణ్యకార్యాలను చూసి మెచ్చుకోవాలన్న కాంక్ష)" అని ఆయన సమాధానమిచ్చారు. *(అహ్మద్, తబ్రానీ, బైహఖీ)*

ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ మీద కాకుండా వేరితరుల మీద ప్రమాణం చేసేవాడు అవిశ్వాసం (కుఫ్ర్) లేదా బహుదైవారాధన (షిర్క్)కు లోనైనట్లే." *(అబూదాబూద్, తిర్మిజీ)*

హుజైఫా బిన్ యమాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: 'అల్లాహ్ తలచేది, ఫలానావారు తలచేది' అని (అల్లాహ్‌ను, ఇతరులను సమానంగా చేస్తూ) మాట్లాడకండి. అలా గాకుండా 'అల్లాహ్ తలచేది, ఆ తర్వాత ఫలానా వారు తలచేది' అని చెప్పండి. (అబూదావూద్)

ఈ రకమయిన షిర్క్ శాశ్వతంగా నరకాగ్నికి ఆహుతి చేయదుగాని ఇది మనిషిని అల్లాహ్ ఏకత్వం (తౌహీద్) నుండి దూరం చేసే ప్రమాదం ఉంది.

https://teluguislam.net

## కానరాని షిర్క్ (దాగివున్న షిర్క్)

ఒక రకంగా ఇది కృత్రిమమైనది. అవకాశవాదంతో కూడుకున్నది. ఇది ఒక్కోసారి మనిషిని పెద్ద షిర్క్ (షిర్కె అక్బర్)కు లోను చేస్తే ఒక్కోసారి చిన్న షిర్క్ (షిర్కె అస్గర్)కు గురి చేస్తూ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఇది పెద్ద షిర్క్‌లో పడవేస్తూ ఉంటుంది. ఎందుకంటే ఇది ఎదుటి వారిని మోసగించే ఉద్దేశ్యంతో చేసే చేష్ట. తద్వారా వారు ఆత్మతృప్తికై వింత నాటకమాడతారు. ఉదాహరణకు: కపటులు, వారు తమ బూటకపు విశ్వాసము (కుఫ్ర్)ను కప్పి పుచ్చుకోవటానికి, ముస్లిములుగా నటిస్తారు.

ఈ 'కనిపించని షిర్క్' ప్రదర్శనాతత్వం (రియా) లాంటి చిన్న తరహా షిర్క్‌గా కూడా రూపాంతరం చెందుతూ ఉంటుంది. ఇంతకు ముందు ప్రస్తావించబడిన మహ్మూద్ బిన్ లబీద్ ఉల్లేఖనం ద్వారా కూడా ఈ సంగతి నిజమని రూఢీ అవుతోంది.

అబూ సయీద్ ఖుద్రీ(రజి)కథనం ప్రకారం, మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వేరొక సందర్భంలో, "నాకు మీ విషయంలో 'కపటాగ్రేసరుడైన మెస్సయ్య' (మసీహుద్దజ్జాల్) పీడన కన్నా ఎక్కువ ఆందోళన కలిగించే పీడన ఏదో తెలుపనా!?" అన్నారు. 'తప్పకుండా తెలుపండి ఓ దైవప్రవక్తా (స)' అన్నారు ప్రియసహచరులు. అప్పుడాయన(స) ఇలా తెలిపారు: "అదే షిర్కె ఖఫీ (దాగివుండే షిర్క్). 'ఎవరయినా ఒక వ్యక్తి నమాజుకై ఉపక్రమించినపుడు, తన నమాజును చూస్తున్న ప్రజలకు అందమైనదిగా ప్రదర్శించే ఉద్దేశంతో మరింత ఆడంబరానికి పోవటం." (ముస్నదె అహ్మద్)

ఇటువంటి హానికరమైన పోకడల నుంచి అల్లాహ్ మనల్ని రక్షించు గాక! (ఆమీన్).

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1) పెద్ద తరహా షిర్క్ గురించి తెల్పండి?
2) చిన్న తరహా షిర్క్‌ను వివరించండి?
3) కానరాని షిర్క్ గురించి వ్రాయండి?

## ఖాళీలు

1) అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించటాన్ని ...... అంటారు.
2) ప్రదర్శనాతత్వం కలిగి యుండటాన్ని......... అంటారు.
3) ........ల వ్యవహారంలో అలసత్వం క్షమార్హం కాదు.

## జతపరచండి

| | | | |
|---|---|---|---|
| 1) | సజీవులను, నిర్జీవును అల్లాహ్‌కు భాగస్వాములగా చేయటం | (   ) | పరలోకంలో క్షమించడం జరుగదు. |
| 2) | షిర్క్ చేస్తున్న స్థితిలో చనిపోయిన వారిని | (   ) | ఆవకాశవాదంతో కూడుకున్నది |
| 3) | షిర్క్ మానవుణ్ణి చివరికి | (   ) | అవిశ్వాసం, లేదా బహు దైవారాధనకు లోనయినట్లే |
| 4) | కానిరాని షిర్క్ | (   ) | పెద్ద తరహా షిర్క్ |
| 5) | అల్లాహ్ మీద కాకుండా ఇతరుల మీద ప్రమాణం చేసేవాడు. | (   ) | నరకాగ్నికి గురి చేస్తుంది |

https://teluguislam.net